# ‘తడి, పొడి’ వేరుగా వేయండమ్మా..!

- పంచాయతీల్లో చెత్త సేకరణపై అధికారుల ప్రత్యేక దృష్టి
- ఆదాయ వనరుల పెంపే లక్ష్యంగా చర్యలు



ట్రాక్టర్‌లో చెత్త వేస్తున్న గ్రామస్తులు



ప్లాస్టిక్ అమ్ముతున్న పంచాయతీ కార్యదర్శి

**మంథనిరూరల్:** చెత్త బండి వచ్చిందమ్మా.. చెత్తబండి. తడి, పొడి చెత్త వేర్వేరుగా వేయండమ్మా.. అంటూ పల్లెల్లో తెల్లవారుజామునే పంచాయతీ సిబ్బంది వాడవాడలా తిరుగుతూ చెత్త సేకరిస్తున్నారు. వర్షాకాల సీజన్ ప్రారంభమైన క్రమంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటాఆ తిరుగుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు.

**34 గ్రామపంచాయతీల్లో..**

మంథని మండలంలోని 34గ్రామ పంచాయతీల్లో ప్రతీరోజు తడి, పొడి చెత్త సేకరిస్తున్నారు. ట్రాక్టర్‌కు మైక్ ఏర్పాటు చేసి అనౌన్స్ చేస్తూ చెత్త సేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

**సేంద్రియ ఎరువు తయారీ..**

ఇంటింటికీ తిరుగుతూ సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లలో నిల్వ చేసి వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారు చేస్తున్నారు.

**ఆదాయ వనరుల వైపు దృష్టి..**

పంచాయతీలకు ఆదాయ వనరుల పెంపుపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వస్తువులను సేకరించి నిల్వ చేసి విక్రయిస్తున్నారు. అలాగే సెగ్రిగేషన్ షెడ్లలో తయారు చేసిన వర్మీ కంపోస్ట్‌ను రైతులకు కిలో రూ.30ల చొప్పున అమ్ముతూ పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. వివిధ మార్గాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తున్నారు.

**ప్రత్యేక పర్యవేక్షణలో అధికారులు..**

గ్రామపంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, నర్సరీలు, ఆదాయ మార్గాలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. మంథని మండలంలోని ఆయా పంచాయతీలను డివిజన ల్‌పంచాయతీ అధికారి, మండల అభివృద్ధి అధికారి నిత్యం పర్యటిస్తూ పర్యవేక్షణ చేస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్నారు.

### అవగాహన కల్పిస్తున్నాం

మండలంలోని ప్రతీ గ్రామాన్ని విజిట్ చేస్తున్నం. కలెక్టర్, అదనపు కలెక్టర్, డీపీవో ఆదేశాల మేరకు ప్రతీ గ్రామపంచాయతీలో తడి, పొడి చెత్త సేకరణపై మైక్ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అలాగే తడిపొడి చెత్తతో వర్మి కంపోస్ట్ తయారీ చేస్తున్నం. పారిశుధ్య నిర్వహణపై పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. – కొమ్మెర సతీశ్‌కుమార్, డీఎల్‌పీవో

## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మ

**గోదావరిఖని:** సీజనల్ వ్యాధులపై ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మ సూచించారు. ఓసీపీ–1 బేస్‌వర్క్‌షాప్‌లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె సీజనల్ వ్యాధుల గురించి కార్మికులకు వివరించారు. వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాల్లో నీరు, చెత్తా చెదారం లేకుండా చూడాలన్నారు. సీనియర్ పర్సనల్ అధికారి సాయిస్వరూప్, వర్క్‌షాప్ హెచ్‌వోడీ ఎంఏ అజీజ్, ఐఎన్‌టీయూసీ నాయకులు జక్కుల దామోదర్, ఏఐటీయూసీ నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### గోరింటాకు వేడుకలు



వేడుకల్లో మహిళలు

**గోదావరిఖనిటౌన్:** స్థానిక మార్కండేయకాలనీలోని లక్ష్మీగణపతి మిత్ర మండలి ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ నియోజకవర్గ అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి హాజరై ఆటపాటలతో సందడి చేశారు. ఆమె మాట్లాడుతూ ఆషాఢంలో గోరింటాకు పండుగ అనేది తరతరాలుగా వస్తోందని, గోరింటాకు స్త్రీలకు సహజ అలంకారంగానే కాకుండా అనారోగ్య సమస్యలను దూరం చేస్తుందన్నారు. వీణ, సత్య, వినోద, స్వాతి, శ్రీదేవి, పద్మ, రాధిక, ప్రభ, రాజ్యలక్ష్మి, సంధ్య, శ్రీలత, రమ్య, సౌజన్య పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ దుష్పరిణామాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

**గోదావరిఖనిటౌన్:** ప్లాస్టిక్ దుష్పరిణామాలపై స్థానిక సెక్రెడ్‌హార్ట్ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వినియోగించొద్దని, క్లాత్‌తో తయారు చేసిన వస్తువులను మాత్రమే వాడాలని స్థానిక రామమందిర్ ఏరియాలోని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్య మేరి, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.


### పౌష్టికాహారంతో ఆరోగ్యం



మహిళా శక్తి సంబరాలు

**ఎలిగేడు:** అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారంతో తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభావతి, రజిత, వెంకటమ్మ, భారతి అన్నారు. మండలంలోని ధూళికట్ట అంగన్‌వాడీ కేంద్రం–3లో ‘తల్లీబిడ్డల ఆరోగ్యం మా బాధ్యత’ కార్యక్రమంలో భాగంగా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఏపీఎం సుధాకర్ మాట్లాడుతూ మహిళలు స్వశక్తి సంఘాల్లో ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సీసీ మల్లేశం, వీవోఏలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ధర్మారం ఎస్సైగా బాధ్యతల స్వీకరణ



ఎస్సై ప్రవీణ్‌కుమార్

**ధర్మారం:** ధర్మారం ఎస్సైగా ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శీలం లక్ష్మణ్‌ను రామగుండం కమిషనరేట్‌కు బదిలీ చేస్తూ 8న సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. కాగా రామగుండ కమిషనరేట్‌లో వీఆర్‌లో ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## రాజకీయ ఉనికి కోసమే ఆరోపణలు



మంథని: మాట్లాడుతున్న ఐలి ప్రసాద్

**మంథని:** రాజకీయంగా ఉనికిని కోల్పోతున్న పుట్ట మధు మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబుపై ఆరోపణలు చేస్తున్నాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసులు చట్టానికి లోబడి పనిచేస్తుంటే వారి విధులకు ఆటంకం కల్పించడమే కాకుండా వారితో దురుసుగా ప్రవర్తించడం ఎంతవరకు సమంజసమన్నారు. సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొండ శంకర్, ఎస్సీ సెల్ మంథని డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్, సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు ఆరెల్లి కిరణ్‌గౌడ్, నాయకులు వొడ్నాల శ్రీనివాస్, బూడిద శంకర్, రవితేజగౌడ్, ఐలి శ్రీనివాస్ ఉన్నారు.

**అనవసర ఆరోపణలు సరికాదు..**

**రామగిరి:** మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు రాజకీయ ప్రయోజనాల కోసం, తమ ఉనికి కాపాడుకోవడానికే దుద్దిళ్ల కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నాడని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ అన్నారు. మండలంలోని సెంటినరికాలనీలోని శ్రీపాదభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగెపల్లిలో ప్రేమజంట ఘటనలో బీఆర్‌ఎస్ నాయకుడు పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తే ఈ విషయాన్ని రాజకీయంగా వాడుకుంటూ దుద్దిళ్ల కుటుంబంపై నిందలు వేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అభివృద్ధిని కాంక్షించి దుద్దిళ్ల కుటుంబంపై అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న, నాయకులు తోట చంద్రయ్య, ఆరెల్లి కొమురయ్య, తులసీరాంగౌడ్, బండారి సదానందం, కండె పోచం, కాటం సత్యం, పుల్లెల కొమురయ్య, ఓడేటి చంద్రశేఖర్, సందెల కుమార్‌స్వామి, ఉడుత శంకర్, ముచ్చకుర్తి శ్రీనివాస్, బంక్ మల్లేశ్ పాల్గొన్నారు.

**దుద్దిళ్ల కుటుంబంపై విమర్శలు చేస్తే సహించేది లేదు**

**ముత్తారం:** ప్రజల్లో ఉనికి కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మంత్రి శ్రీధర్‌బాబు దుద్దిళ్ల కుటుంబంపై లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం అన్నారు. ముత్తారంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిని సమర్థించడమే కాకుండా మంత్రి, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై అర్థరహిత ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. నాయకులు తూటి రఫీ, మద్దెల రాజయ్య, గాదం శ్రీను, బక్కతట్ల వినీత్, వజీద్‌పాషా ఉన్నారు.

### ఆదివారంపేట అభివృద్ధికి సహకరించండి



మంత్రితో మైదం భారతి, వరప్రసాద్

**రామగిరి:** మండలంలోని ఆదివారంపేట అభివృద్ధికి సహకరించాలని ఉమ్మడి ముత్తారం మాజీ జెడ్పీటీసీ మైదం భారతి, వరప్రసాద్ కోరారు. హైదరాబాద్‌లో శనివారం మంత్రి క్వార్టర్‌లో ఆయనను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆదివారంపేట రైతువేదిక నుంచి బేగంపేట ప్రధాన రహదారి వరకు సీసీరోడ్డు నిర్మాణం, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి త్వరలోనే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నట్లు వారు తెలిపారు. వారి వెంట తన్వి, శ్రద్ధ ఉన్నారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శ



నగదు అందజేస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

**ధర్మారం:** మండలంలోని దొంగతుర్తి గ్రామ పంచాయతీ కార్మికుడు ఆకుల రాజయ్య గుండెపోటుతో మరణించారు. కాగా ఆ కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించి రూ.పదివేల నగదు అందించారు. మాజీ వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి తండ్రి చిన్నయ్య రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆ కుటుంబాన్ని మాజీ మంత్రి పరామర్శించారు. మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సదయ్య, నాయకులు ఆవుల శ్రీనివాస్, వేణుగోపాల్, పాకాల రాజయ్య, మూల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### విత్తన బంతుల తయారీ



విత్తన బంతులతో విద్యార్థులు

**యైటింక్లయిన్‌కాలనీ:** అబాకస్ అకాడమీ ఆధ్వర్యంలో విత్తన బంతుల తయారీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన అబాకస్ అకాడమీ నిర్వాహకురాలు మంజు వనజీవి రామయ్యను ఆదర్శంగా తీసుకొని సేవ్ నేచర్, సేవ్ ఫ్యూచర్ అనే నినాదంతో విద్యార్థులతో మొక్కలు పెంచాలని సంకల్పించింది. వివిధ రకాల పండ్ల మొక్కలకు సంబంధించిన జామ, సపోట, నారింజ, వంటి పశుపక్షులకు ఉపయోగపడేలా విత్తన బంతులు తయారు చేశారు. ఈ సందర్భంగా మంజు మాట్లాడుతూ ఈ విత్తన బంతులను సింగరేణి సంబంధించిన ఓబీ డంపు యార్డ్‌లో చల్లనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



మాట్లాడుతున్న రఘువీర్‌సింగ్

**జూలపల్లి:** బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ అన్నారు. మండలంలోని వెంకటరావుపల్లెలో శనివారం బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు గుడ్యాల వెంకట్రావు, మచ్చ శ్రీనివాస్, కొమ్మ భూమయ్య, మచ్చ యాదగిరి, బడుగు శ్రీనివాస్, హన్మంతు, బడుగు ఈశ్వర్, రేషవేని ఐలయ్య, మంద స్వామి, పోల్సాని శ్రీనివాస్‌రావు, తువ్వ ఎల్లయ్య, వడ్లకొండ ప్రకాశ్ పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలి

**ధర్మారం:** మండలంలోని మల్లాపూర్‌లో రోడ్డును ఆక్రమించి చేసిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలను మండల పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శి బేఖాతర్ చేశారని ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ గందం మహేందర్ ఆరోపించారు. మహేందర్‌తో పాటు కొంత మంది గ్రామస్తులు అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గతనెల 18 జిల్లా పంచాయతీ అధికారి గ్రామానికి వచ్చి విచారణ చేశారు. ఈ విచారణలో మల్లాపూర్‌లో హన్మాన్ గుడి నుంచి గ్రామపంచాయితీ వరకు 22ఫీట్ల రోడ్డు ఉండగా ఇదే గ్రామానికి చెందిన మచ్చిపట్ల రేణుక 6ఫీట్ల రోడ్డు ఆక్రమించి నిర్మాణం చేసినట్లు, అదేవిధంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డు 22 ఫీట్లు ఉండగా ఇదే గ్రామానికి చెందిన నర్సయ్య రెండు ఫీట్ల రోడ్డు అక్రమించుకుని నిర్మాణం చేసినట్లు డీపీవో విచారణలో తేలినట్లు నిర్ధారించారు. అయితే ఈ విషయమై గత నెల21 జిల్లా పంచాయతీ అధికారి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కార్యదర్శితో పాటు మండల పంచాయతీ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అయినా అధికారులు అక్రమ నిర్మాణాలు తొలగించలేదని మాజీ ఎంపీటీసీ ఆరోపించారు. కార్యదర్శి సతీశ్‌కుమార్‌ను వివరణ కోరగా జిల్లా పంచాయతీ అధికారి ఆఆదేశాల మేరకు త్వరలోనే అక్రమ నిర్మాణాలు తొలగిస్తామన్నారు.

### అవయవదానంపై అవగాహన

**పాలకుర్తి:** మండలంలోని కన్నాల శాలపల్లికి చెందిన బూర్ల భాగ్యలక్ష్మి సంస్మరణ సభ శనివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన భాగ్యలక్ష్మి నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. ఈ నేపథ్యంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులకు ప్రశంస పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులకు అవయవదానం, నేత్రదానంపై ఫౌండేషన్ మండలాధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్ అవగాహన కల్పించారు. ఫౌండేషన్ సభ్యులు భీష్మాచారి, లింగమూర్తి, దేవీ లక్ష్మినర్సయ్య, కన్నాల సింగిల్‌విండో మాజీ చైర్మన్ మల్క రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**పాలకుర్తి:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్సై స్వామి సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం క్రాస్‌రోడ్డు వద్ద డ్రగ్స్, గంజాయి నియంత్రణపై శనివారం స్థానికులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ గంజాయి వినియోగం, సరఫరా చట్టరీత్యా నేరమని తెలిపారు. పోలీస్‌సిబ్బంది సురేశ్, శేఖర్, ఆటోడ్రైవర్లు, స్థానికులు పాల్గొన్నారు.

### జయ్యారంలో వనమహోత్సవం

**పాలకుర్తి:** మండల పరిధిలోని జయ్యారంలో శనివారం ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ చెరువుకట్ట వెంబడి ఖర్జూర మొక్కలు నాటారు. ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది రఘు, శ్రావణ్, గీత, రాజ్‌కుమార్, స్థానిక గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## మేడారంలో స్వశక్తి సంఘాల సంబరాలు



సంబరాల్లో మహిళలు

**ధర్మారం:** మండలంలోని నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మహిళా స్వశక్తి సంఘాల సభ్యులు సంబరాలు నిర్వహించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఏపీఎం తులసీమాత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



**రామగుండం:** లింగాపూర్ గ్రామ శివారు నుంచి గోదావరి నదికి వెళ్లే రహదారి ఇసుక ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో కనీసం నడవడానికి వీలు లేకుండా తయారైంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి రహదారిని పునరుద్ధరించాలని, వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు వెళ్లే విధంగా సహకరించాలని కోరుతున్నారు.

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

## సింగరేణి వార్తలు

### విధి నిర్వహణలో బదిలీలు సహజం



సన్మానిస్తున్న ఏపీఏ జీఎం నాగేశ్వరరావు

**రామగిరి:** విధి నిర్వహణలో ప్రతీ ఉద్యోగికి బదిలీలు సహజమని ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో సివిల్ విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాకు వెళ్తున్న పి.రాజేంద్రప్రసాద్‌ను శనివారం వివిధ విభాగాధిపతులు, అధికారులతో కలిసి సన్మానించారు. ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్‌వోటూ జీఎం బండి సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారి సీ.హెచ్.వెంకటరమణ, సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, పర్సేజ్ డీజీఎం పి.డి.సుధాకర్, సీనియర్ ఫైనాన్స్ అధికారి శిరీష పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

**పాలకుర్తి:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం స్కూల్ నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని జీడీనగర్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాల ఎదుట డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రింగల సురేశ్‌తో కలిసి శనివారం వారు పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వం రెండో శనివారం సెలవుదినంగా ప్రకటించినప్పటికీ పాఠశాల యాజమాన్యం పాఠశాల నిర్వహిస్తోందని, దీనిపై జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం పాఠశాల నిర్వహిస్తున్న యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### అమ్మ నేత్రాలు సజీవం

**కోల్‌సిటీ:** గోదావరిఖని జవహర్‌నగర్‌కు చెందిన బింగి లక్ష్మి(92) అనే వృద్ధురాలు అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా మరో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించడానికి కుటుంబ సభ్యులు ఆమె కళ్లను శనివారం దానం చేశారు. వారి దగ్గరి బంధువు రిటైర్డ్ ఎస్సై శారద నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో మృతురాలి పెద్ద కొడుకు, కోడలు రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి రాజేశం–భారతి, ఒడిశాలోని సింగరేణి నైనీ బ్లాక్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రెండో కొడుకు, కోడలు మాధవరావు– శారద, కూతురు సరస్వతి మృతురాలి నేత్రాలను దానం చేయడానికి అంగీకారం తెలిపారు. శనివారం వారి నివాసంలో ఎల్వీప్రసాద్ ఐబ్యాంక్ టెక్నీషియన్ సహకారంతో మృతురాలి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి వాసు, పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్ నేత్రదాత కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు.

## కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**రామగిరి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం బాణసంచా పేల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న, నాయకులు తోట చంద్రయ్య, ఎల్లె రామ్మూర్తి, ఆరెల్లి కొమురయ్య, కొరుకొప్పుల తులసీరాంగౌడ్, బండారి సదానందం, సందెల కుమార్, అవినాశ్‌గౌడ్, బంక్ మల్లేశ్‌గౌడ్, ఓడేటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**

**యైటింక్లయిన్‌కాలనీ:** కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ కాంగ్రెస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, బీసీసెల్ అధ్యక్షుడు రాజేశం, రాజు, చక్రపాణి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రానికి మోక్షం

**జూలపల్లి:** మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రానికి ఎమ్మెల్యే విజయరమణారావు చొరవతో మోక్షం లభించింది. స్థానిక బాలికల వసతి గృహం ఎదుట పదేళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రం–1 భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కాగా పనులు ప్రారంభమై స్లాబు వరకు పూర్తయింది. నిధులు చాలక, గుత్తేదారు పనులు చేయక, అధికారులు పట్టించుకోక పదేళ్లుగా స్లాబుతోనే నిలిచి, అద్దె భవనంలో కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. 15రోజుల క్రితం ఎమ్మెల్యే వసతిగృహంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రాగా, అధికారులు భవనం పరిస్థితి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి భవన నిర్మాణం పూర్తి చేయడానికి ప్రత్యేక నిధుల నుంచి మంజూరు చేస్తానని హామీ ఇవ్వంతో పనులు ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.